JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | బుధవారం 01-10-2025
Medchal - Malkajgiri | Wednesday 01-10-2025
jayabherinews
సంపుటి : 02 | సంచిక : 126 | పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 126 | Pages : 8 | ₹: 5

**విలేకర్లు కావలెను**
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


# తెలంగాణ తల్లి ఫ్లై ఓవర్ రెడీ

హైదరాబాద్ నగరంలో ఓ చోట పేరు మార్పు జరిగింది. తెలంగాణ సచివాలయం సమీపంలో ఉన్న తెలుగు తల్లి ఫ్లైఓవర్ పేరును రాష్ట్ర ప్రభుత్వం మార్చింది. తెలుగు తల్లి ఫ్లైఓవర్ పేరును తెలంగాణ తల్లి ఫ్లైఓవర్‌గా రాష్ట్ర ప్రభుత్వం మార్చింది. ఈ మేరకు తెలంగాణ తల్లి ఫ్లైఓవర్‌పై కొత్త బోర్డును జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు. ఇది చూసి నగరవాసులు ఆశ్చర్యపోతున్నారు.




✍ జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 30:

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ బుధవారం (సెప్టెంబరు 24న) జరిగిన సమావేశంలో తెలుగు తల్లి ఫ్లైఓవర్‌ను తెలంగాణ తల్లి ఫ్లైఓవర్‌గా పేరు మార్చడానికి సంబంధించి ఒక ప్రతిపాదనను ఆమోదించింది. ఈ ప్రతిపాదనను సాధారణ అజెండా అంశాలలో భాగం కాకుండా జనరల్ బాడీ సమక్షంలో ఆమోదానికి పెట్టారు. కమిటీ ఆమోదించిన మరొక ప్రతిపాదన GHMC ఔట్‌సోర్సింగ్ కార్మికులు, శానిటేషన్ కార్మికుల జీతాల ఖాతాలను ప్రైవేట్ బ్యాంకు ఖాతాలు తెరవడం, వాటితో పాటు ప్రమాద బీమా, జీవిత భీమా లాభాలను అందించే నిర్ణయం తీసుకోవడం పై చర్చించారు.

ఔట్‌సోర్స్ / శానిటేషన్ కార్మికులకు బ్యాంకు ఖాతాలను ఎంపిక చేసిన బ్యాంకులో తెరవాలని ఆదేశాలు జారీ చేయనున్నారు. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మొత్తం 24 ప్రతిపాదనలను ఆమోదించింది, వీటిలో సీసీ రోడ్లు, భూ సేకరణ, వీధి దీపాల నిర్వహణ పొడిగింపు, వివిధ ఇతర నిర్మాణ పనులు ఉన్నాయి. ట్రాఫిక్ రద్దీని తగ్గించడంలో భాగంగా 1.1 కిలోమీటర్ల మేర గతంలో ఈ ఫ్లైఓవర్ నిర్మించారు. తెలుగు తల్లి ఫ్లైఓవర్ పేరును తెలంగాణ తల్లి ఫ్లైఓవర్‌గా మారుస్తూ జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఇటీవల నిర్ణయం తీసుకుంది.

లోయర్ ట్యాంక్‌బండ్ నుంచి సెక్రటేరియట్ వరకు అనుసంధానమయ్యే ఈ ఫ్లైఓవర్ పేరు మార్పును గత వారం ఆమోదించారు. హైదరాబాద్ నగరంలో మొత్తం 53 ఫ్లైఓవర్లు ఉండగా, అందులో కీలకమైన వాటిలో తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ ఒకటని చెప్పవచ్చు. కొండాపూర్ గచ్చిబౌలి వరకు ఏర్పాటు చేసిన పీజేఆర్ ఫ్లైఓవర్ హైదరాబాద్ నగరంలో నిర్మించిన చివరి ఫ్లైఓవర్. నగరంలో మరికొన్ని ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మాణంలో ఉండగా, కొన్ని ఆమోదం పొందాయి. 1.65 KM పొడవైన ఒవైసీ హాస్పిటల్ ఫ్లైఓవర్ నిర్మాణంలో ఉంది. 18.5 కిమీతో జెబిఎస్ తుముకుంట ఫ్లైఓవర్ భారతదేశంలో అతి పొడవైనదిగా మారబోతోంది. 2.56 KM పొడవైన నల్గొండ క్రాస్ రోడ్ ఒవైసీ జంక్షన్ ఫ్లైఓవర్ నిర్మాణంలో ఉంది. 6.4 కి.మీ పొడవైన ఉప్పల్ నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో ఉంది. 1.2 కి.మీ పొడవైన అంబర్‌పేట ఫ్లైఓవర్ ఆమోదం పొందింది. ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు నగరంలో 8 అండర్ పాస్‌లు సేవలు అందిస్తున్నాయి.



## ప్రధానికి అరుదైన గౌరవం

- మెలోని ఆత్మకథకు మోదీ ముందుబాట

✍ జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 30:

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి అరుదైన గౌరవం దక్కింది. ఇటలీ ప్రధాన మంత్రి జార్జియా మెలోని రాసిన 'ఐ యామ్ జార్జియా మై రూట్స్, మై ప్రిన్సిపుల్స్' అనే పుస్తకానికి సంబంధించి భారతీయ ఎడిషన్ ముందుమాటను ప్రధాని మోదీ రాశారు. జార్జియా మెలోనిని దేశభక్తురాలు, తనకు అద్భుతమైన సమకాలీన నాయకురాలు అని ముందుమాటలో నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ పుస్తకాన్ని త్వరలో రూపా పబ్లికేషన్స్ భారతదేశంలో విడుదల చేయనుందని సమాచారం. ఇటలీ ప్రధాని జార్జియా మెలోని జ్ఞాపకాలను పొందుపరుస్తూ రాసిన 'ఐ యామ్ జార్జియా మై రూట్స్, మై ప్రిన్సిపుల్స్' పుస్తకాన్ని ఆమె మన్ కీ బాత్ అని భారత ప్రధాని మోదీ అభివర్ణించారు, భారత పాఠకులకు ఆమె జీవిత కథను పరిచయం చేయడం తనకు దక్కిన గొప్ప గౌరవం అని పేర్కొన్నారు. నాయకురాలిగా మెలోని ప్రయాణం అందరికీ స్ఫూర్తిదాయకం, చారిత్రాత్మకం అని మోదీ ప్రశంసించారు. ఇది భారతదేశంలో "ఒక అసాధారణ రాజకీయ నాయకురాలి ఉత్తేజకరమైన కథ"గా ఉంటుందని భారత ప్రధాని అన్నారు.

...మిగతాది 2 లో



## గిలగిలలాడుతున్న రూపాయి

✍ జయభేరి, ముంబై, సెప్టెంబర్ 30:

భారత రూపాయి మంగళవారం (సెప్టెంబర్ 30) కొత్త ఆల్ టైమ్ కనిష్ట స్థాయికి పడిపోయింది. కొద్ది రోజుల క్రితం నెలకొల్పిన మునుపటి రికార్డును అధిగమించింది. భారత్, అమెరికా మధ్య కొనసాగుతున్న వాణిజ్య వివాదాలు అమెరికా డాలర్ కు బలమైన డిమాండ్‌ను పెంచాయి. ఇది రూపాయి మారకంపై ఒత్తిడిని పెంచింది. డాలర్ తో పోలిస్తే భారత కరెన్సీ రూ. 88.80 కు పడిపోయింది. గత వారం కనిష్ట స్థాయి 88.7975 కంటే దిగువకు పడిపోయింది.డాలర్ మరోసారి బలమైన పునరాగమనం చేసింది. ఇది భారత రూపాయిపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపింది. మంగళవారం, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 88.80కి పడిపోయింది. ఇది ఇప్పటివరకు అత్యంత కనిష్ట స్థాయి.

...మిగతాది 2 లో



## యువ క్రికెటర్ తిలక్ వర్మ

ఆసియా కప్ 2025 లో భారత జట్టును విజేతగా నిలపడంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన యువ క్రికెటర్ తిలక్ వర్మను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. హైదరాబాద్ చేరుకున్న యువ క్రికెటర్ తిలక్ వర్మ జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిలక్ వర్మను, కోచ్ సలాం బయాష్‌ను ముఖ్యమంత్రి సత్కరించారు. తిలక్ వర్మ తన క్రికెట్ బ్యాట్‌ను ముఖ్యమంత్రికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనా రెడ్డితో పాటు ఉన్నతాధికారులు ఉన్నారు.



## నా మీద ప్రతీకారం తీర్చుకోండి కార్యకర్తలపై వద్దు

✍ జయభేరి, చెన్నై, సెప్టెంబర్ 30:

కరూర్ లో తొక్కిసలాట సంఘటన జరిగిన 3 రోజుల తర్వాత టీవీకే అధ్యక్షుడు విజయ్ ఒక వీడియో విడుదల చేశారు. తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోలేదని అన్నారు. 5 జిల్లాల్లో ప్రచారం జరిగినప్పుడు జరగని సంఘటన కరూర్‌లో మాత్రమే ఎందుకు జరిగిందని విజయ్ వీడియోలో ప్రశ్నించారు. నా జీవితంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోలేదు. నా హృదయం బాధతో నిండిపోయింది. మేము ఇప్పటికే 5 జిల్లాల్లో ప్రచారం చేశాము. ఇది కరూర్‌లో మాత్రమే ఎందుకు జరిగిందో .. మిగతా అన్ని చోట్లా ఎందుకు జరగడం లేదో ప్రజలకు తెలుసన్నారు. కరూర్ ప్రజలు ఏమి జరిగిందో నిజం చెప్పినప్పుడు, దేవుడే వచ్చి చెప్పినట్లేనన్నారు. త్వరలో నిజాలన్నీ బయటపడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. CM సర్, మీకు కోపం ఉంటే లేదా ప్రతీకారం తీర్చుకోవాలనే ఉద్దేశ్యం ఉంటే, నాపై తీర్చుకోండి..కానీ కార్యకర్తలపై వద్దని చెప్పారు. అత్యంత ఇరుకైన ప్రదేశంలో సభ నిరవహించాలన్న విమర్శలపైనా విజయ్ వీడియోలో స్పందించారు. మేము ఆ స్థలాన్ని జాగ్రత్తగా ఎంచుకుంటాము, అందుకే అన్ని రాజకీయ కారణాలను పక్కనపెట్టి, ప్రజల భద్రతను

...మిగతాది 2 లో

## ఏపీకి పూర్వోదయ పథకం కింద నిధులివ్వండి

- వెనుకబడిన ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి ఆ నిధులే కీలకం
- ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రికి సీఎం చంద్రబాబు వినతి

✍ జయభేరి, ఢిల్లీ, సెప్టెంబరు 30:

ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి పూర్వోదయ పథకం కింద నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రాన్ని కోరారు. ఢిల్లీ పర్యటనలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన సీఎం ఆమెకు ఈ అంశంపై వినతిపత్రం సమర్పించారు. దేశంలోని తూర్పు ప్రాంతాల్లో ఉన్న రాష్ట్రాల సమగ్ర అభివృద్ధి కోసం పూర్వోదయ పథకానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఏపీపై దృష్టి







## అరుణాచలంలో పోలీసులు దారుణం

- జయభేరి, చెన్నై, సెప్టెంబర్ 30:

అరుణాచలంగా ప్రసిద్ధి చెందిన తమిళనాడులోని తిరువణ్ణామలై సమీపంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 18 ఏళ్ల యువతిపై ఇద్దరు పోలీసులు అత్యాచారం చేసిన ఘటన సంచలనంగా మారింది. ఆమెపై అత్యాచారం చేసిన పోలీసులను

▶▶ మొదటిపేజీ తరువాయి

## ప్రధానికి అరుదైన గౌరవం

ప్రపంచ నాయకులతో సంవత్సరాలపాటు అనుభవాలను గుర్తుచేసుకుంటూ, సాంస్కృతిక గౌరవం, ప్రపంచంతో సమానమైన సంబంధంపై ఇటలీ ప్రధాని మెలోని చేసిన కృషి భారతీయ విలువలతో ప్రతిధ్వనిస్తుందని మోదీ రాసుకొచ్చారు. ఈ జ్ఞాపకం జార్జియా మెలోని రాజకీయ జీవితాన్ని ఆమె టీనేజ్ దశ నుంచి ఇటలీ మొదటి మహిళా ప్రధానమంత్రిగా ఎదిగిన తీరును కళ్లకు కట్టినట్లు వివరిస్తుంది. ఆమె వ్యక్తిగత జీవితం, ఆమె భాగస్వామి ఆంద్రియా, వారి కుమార్తె గినివ్రా, తల్లిగా మారడం, విశ్వాసం, గుర్తింపుపై ఆమె ఆలోచనలను పుస్తకం వివరిస్తుందిజార్జియా మెలోని పోరాటాలు, ఆకాంక్షలపై స్పష్టమైన అంతర్ద ష్టితో ఇటలీ, యూరప్ కోసం తన జీవితాన్ని కేటాయించారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మరో దేశ ప్రధాని రాసిన ఆటోబయోగ్రఫీకి ముందు మాట రాసే అవకాశం నరేంద్ర మోదీకి రావడం అరుదైన గౌరవమని చెప్పవచ్చు. సహజంగా ఇలాంటి విషయాల్లో దేశానికి చెందిన గొప్ప మేధావులు, రచయితల సాయం కోరతారు. కానీ మోదీతో తనకున్న సాన్నిహిత్యం, స్నేహం కారణంగా భారత్‌లో విడుదల కానున్న తన పుస్తకానికి ముందు మాట రాయాలని కోరారు. మోదీ తన ఆటో బయోగ్రఫీకి ముందు మాట రాయడం తనకు దక్కిన గౌరవమని జార్జియా మెలోని పేర్కొన్నారు.జార్జియా మెలోని రాసిన ఈ స్వీయ చరిత్ర మొదటి వెర్షన్ 2021లోనే పబ్లిష్ అయింది. అప్పుడు ఆమె ఇటలీలో విపక్షనేతగా ఉన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెద్ద కుమారుడు ఆ పుస్తకానికి ముందుమాట రాశారని తెలిసిందే. 2025 జూన్ నెలలో అమెరికాలో మెలోని ఆటో బయోగ్రఫీ పుస్తకాన్ని విడుదల చేశారు. తాజాగా భారత్‌లో తన పుస్తకాన్ని ఇటలీ ప్రధాని మెలోని విడుదల చేయనున్నారు. పలు అంతర్జాతీయ వేదికల్లో ప్రధాని మోదీ, జార్జియా మెలోని కలిసి దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యేవి. యూఏఈ లోని దుబాయ్ వేదికగా జరిగిన కాప్ 28 సదస్సులో మోదీ, మెలోని తీసుకున్న సెల్ఫీని Melodi అనే హ్యాష్ ట్యాగ్‌తో పోస్ట్ చేయగా ట్రెండ్ అయింది. మెలోని లోని మెలో, మోదీలోని డీ అనే అక్షరాలతో మెలోడీ క్రియేట్ చేశారన్న మాట. జీ7 సదస్సు సమయంలోనూ మెలోని, మోదీ దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా వైరల్ అయ్యాయి.

## గిలగిలలాడుతున్న రూపాయి

గత వారం నెలకొల్పిన రికార్డును ఈసారి బద్దలు కొట్టింది. ఈ క్షీణతకు అతిపెద్ద కారణం భారతదేశంయునైటెడ్ స్టేట్స్ మధ్య పెరుగుతున్న వాణిజ్య ఉద్రిక్తతలే కారణమంటున్నారు ఆర్థిక నిపుణులు. దీని వల్ల డాలర్‌కు డిమాండ్ పెరిగింది. ఇతర దేశాల కరెన్సీలతో పాటు రూపాయి కూడా క్షీణించింది.భారతదేశం మాత్రమే కాదు, మొత్తం ఆసియా ఆర్థిక వ్యవస్థపై డాలర్ ప్రభావం చూపింది. రూపాయితో పాటు, ఇతర ఆసియా దేశాల కరెన్సీలు కూడా ప్రభావితమయ్యాయి. దక్షిణ కొరియా, థాయిలాండ్, ఇండోనేషియా, సింగపూర్, చైనా, జపాన్ కరెన్సీలు కూడా స్వల్పంగా తగ్గాయి. ఇది భారత్ పాటు ఆసియా ఆర్థిక వ్యవస్థను ఒత్తిడిలోకి నెట్టినట్లు స్పష్టవుతోంది.ఇదిలావుంటే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వాణిజ్యానికి సంబంధించి ఒక కీలక ప్రకటన చేశారు. అమెరికాలో ఫర్నిచర్ తయారు చేయని దేశాల వస్తువులపై భారీ పన్నులు విధించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అమెరికా వెలుపల తీసిన ప్రతి చిత్రానికి 100% పన్ను విధించాలని కూడా ఆయన అన్నారు. ట్రంప్ ప్రకటన మార్కెట్‌ను మరింత ఆందోళనకు గురిచేసింది. ప్రపంచవ్యాప్తంగా అనేక వ్యాపారాలు ఇప్పుడు అమెరికా నుండి దూరం కావడం ప్రారంభమయ్యాయి. ఇది భారతదేశం పై కూడా తీవ్ర ప్రభావం చూపవచ్చు.గత వారం భారత ఆర్థిక వ్యవస్థను అంతగా ఆకట్టుకోలేకపోయింది. ట్రంప్ మొదట H1B వీసా ఫీజులను పెంచారు. ఇది మన ఐటీ రంగానికి దెబ్బ. ఆ తర్వాత ఆయన భారతీయ ఔషధాలపై పన్నును ప్రకటించారు. దీంతో స్టాక్ మార్కెట్ కుప్పకూలింది మరియు సెన్సెక్స్ వారానికి 2,000 పాయింట్లకు పైగా పడిపోయింది. అటు రూపాయి కూడా 88.7175 వద్ద ముగిసింది. ఇది ఆ సమయంలో దాని అత్యల్ప స్థాయి. ఇప్పుడు, కొత్త రికార్డు బద్దలైంది.ద్రవ్యోల్బణం పెరుగుతుంది: రూపాయి బలహీనపడినప్పుడు, దిగుమతి చేసుకున్న వస్తువులు మరింత ఖరీదు అవుతాయి. ఇందులో పెట్రోల్, డీజిల్, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, వంట నూనె వంటి వస్తువులపై ప్రభావం చూపుతుంది. రవాణా ఖర్చులు పెరుగుతాయి. మార్కెట్లో ఉన్న ప్రతిదాని ధర పెరుగుతుంది. ప్రయాణం, సరుకు రవాణా భారం: విదేశాల నుండి చాలా ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటుంది. రూపాయి పడిపోయినప్పుడు, పెట్రోల్, డీజిల్ మరింత ఖరీదు కానున్నాయి. ఇది బస్సులు, టాక్సీలు, ట్రక్కులపై ప్రభావం చూపుతుంది. మీరు ప్రయాణిస్తున్నా లేదా వస్తువులను ఆర్డర్ చేస్తున్నా, ప్రతిదీ ఖరీదుగా మారుతుంది. విదేశీ వస్తువులపై ప్రభావం: మనం మందులు, స్మార్ట్‌ఫోన్‌లు, డ్రై ఫ్రూట్స్ సహా అనేక ఎలక్ట్రానిక్స్ వస్తువులను విదేశాల నుండి కొంటాము. రూపాయి బలహీనపడితే, వీటిని దిగుమతి చేసుకోవడానికి ఎక్కువ ఖర్చు అవుతుంది. సాధారణ ప్రజలు వాటిని భరించలేకుండా పోతుంది.పెరగనున్న రుణ భారం: రుణాలు తీసుకోవడం మరింత భారం అవుతుంది. ప్రభుత్వం, పెద్ద కంపెనీలు తరచుగా విదేశాల నుండి రుణాలు తీసుకుంటాయి. రూపాయి బలహీనపడినప్పుడు, ఆ రుణాలను తిరిగి చెల్లించడానికి ఎక్కువ ఖర్చు అవుతుంది. ఇది ప్రభుత్వ ఖర్చులను పెంచుతుంది. అధిక వడ్డీ రేట్లకు దారితీయవచ్చు. ఇది మీ గృహ రుణం, కారు రుణం, ఇతర రుణ EMI లను ప్రభావితం చేయవచ్చు.

## పూర్వోదయ పథకం.. నిధులివ్వండి

పెట్టాలని సీఎం విజ్ఞప్తి చేశారు. పూర్వోదయ పథకంలో భాగంగా బీహార్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశారు. పూర్వోదయ నిధులతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రికి ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. రాయలసీమలో హార్టికల్చర్, ఉత్తరాంధ్రలో కాఫీ పంట ఉత్పత్తులు, జీడి, కొబ్బరి తోటలు, కోస్తాంధ్రలో ఆక్వా కల్చర్‌ను ప్రోత్సహించేలా ప్రణాళికలు రూపొందించినట్లు సీఎం తన విజ్ఞాపన పత్రంలో పేర్కొన్నారు. ఈ రంగాల్లో చేపట్టే ప్రాజెక్టులకు కేంద్రం పూర్వోదయ పథకంలో నిధులు కేటాయిస్తే మంచి ఫలితాలు వస్తాయని ముఖ్యమంత్రి వివరించారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఎకనమిక్ డెవలప్మెంట్ కు పూర్వోదయ పథకం అమలు ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. వెనుక బడిని ప్రాంతాల ఆర్థిక అభివృద్ధికి దోహదం చేసేలా ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించాలని సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్ ను కోరారు. అనంతరం కేంద్ర జల శక్తి శాఖామంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు. పోలవరం పనుల పురోగతిని గురించి కేంద్రమంత్రికి సీఎం వివరించారు.

## అరుణాచలంలో పోలీసులు దారుణం

అదుపులోకి తీసుకుని రహస్య ప్రదేశంలో ఉన్నతాధికారులు ప్రశ్నిస్తున్నారు. సోమవారం రాత్రి ఆంధ్రప్రదేశ్ నుంచి తిరువణ్ణామలై సమీపంలోని ఎంథాల్ బైపాస్ రోడ్డుపై ఇద్దరు మహిళలు, ముగ్గురు వ్యక్తులు, డ్రైవర్‌తో సహా వాహనంలో వచ్చారు. ఆ సమయంలో బైపాస్ రోడ్డుపై రాత్రి గస్తీ నిర్వహిస్తున్న తిరువణ్ణామలై ఈస్ట్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుళ్లు సుందర్, సురేశ్‌రాజ్‌లు వాహనాన్ని అడ్డగించి వాహనంలో ఉన్న వారిని కిందకు దించారు. అందర్నీ దింపి ఎవరెవరు ఎక్కడెక్కడి నుంచి వస్తున్నారో ప్రశ్నించారు. ఆ సమయంలో యువతి లక్ష్మిపై వారి కన్ను పడింది. ఆమె దగ్గర అనుమానాస్పద వస్తువులు ఉన్నాయని కొట్టి.. ఆమెను సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలోని పొదల్లోకి ఈడ్చుకెళ్లి అత్యాచారం చేశారు. తర్వాత బైపాస్ రోడ్డు పక్కనే వదిలేసి ఇద్దరు పోలీసులు అక్కడి నుంచి పరారయ్యారు. తెల్లవారుజామున 4 గంటలకు అక్కడికి వచ్చిన గ్రామస్థులు లక్ష్మిని రక్షించి 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం తిరువణ్ణామలై ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. ఈ సమాచారం తెలుసుకున్న తిరువణ్ణామలై జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సుధాకర్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సతీష్‌బాధితురాలిని పరామర్శించారు. ఏం జరిగిందో స్వయంగా తెలుసుకున్నారు. ఈ విచారణలో రాత్రి జరిగిన విషయాన్ని బాధితురాలు చెప్పింది. దీంతో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలిచారు. అంతేకాకుండా, తిరువణ్ణామలై మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో 5 మంది పోలీసు ఇన్‌స్పెక్టర్లు సహా 10 మందికి పైగా పోలీసు అధికారులను మోహరించారు. రేపిస్టులిద్దరూ పోలీసులే కావడంతో తిరువణ్ణామలై జిల్లాలో తీవ్ర ఉత్కంఠ రేపింది. వారిద్దర్నీ అరెస్టు చేసిన పోలీసులు.. విచారణ జరుపుతున్నారు. కాలంగోల అరుణాచలంలో తెలుగు యాత్రికులపై దాడులు పెరుగుతున్నాయి. పెద్ద ఎత్తున భక్తులు అరుణాచలం వెళ్తుండటంతో తెలుగు యాత్రికులపై వ్యతిరేకత చూపిస్తున్నారు. ఇది ద్వేషంగా పెంచుకుని దాడులకు పాల్పడుతున్నారు. ఇప్పుడు స్వయంగా పోలీసులే అత్యాచారనికి పాల్పడటం సంచలనంగా మారింది.

# ఓ వైపు జాతీయ వాదం.. మరో వైపు విభజనవాదం

**భారతదేశం ప్రస్తుతం రెండు వ్యతిరేక దిశల్లో పయనిస్తోంది. ఒకవైపు జాతీయవాద భావనలు బలపడుతుండగా, మరోవైపు విభజన శక్తులు కూడా ఊపందుకుంటున్నాయి. ఈ విరుద్ధతలు సమాజంలో ఉద్రిక్తతలను పెంచుతున్నాయి. దేశవ్యాప్తంగా జాతీయవాద భావనలు పటిష్టమవుతున్నాయి. విద్యా సంస్థల్లోనూ ఈ పోకడ స్పష్టంగా కనిపిస్తోంది.**



దక్షిణాది నుంచి ఉత్తరాది వరకు, ప్రముఖ యూనివర్శిటీల్లో జాతీయ భావనలతో కూడిన సంఘాలు విజయాలు సాధిస్తున్నాయి. ఇది కేవలం విద్యార్థి రాజకీయాలకే పరిమితం కాదు.. స్థానిక సంస్థల ఎన్నికలు, రాష్ట్ర అసెంబ్లీలు, పార్లమెంటరీ ఎన్నికల్లో కూడా జాతీయవాద పార్టీలు తమ ఆధిక్యతను నిరూపిస్తున్నాయి. అంతేకాకుండా, ధార్మిక జాగృతి ఒక ఉద్యమ రూపం దాలుస్తోంది. ఆలయ పర్యటనలు పెరుగుతున్నాయి, భక్తుల సంఖ్య గణనీయంగా వృద్ధి చెందుతోంది. ఈ ధోరణి సమాజంలో ఐక్యతను ప్రోత్సహిస్తుంది, కానీ దీనిని విచ్ఛిన్న శక్తులు దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంది. జాతీయవాదం బలపడటం దేశ ఐక్యతకు బలమిస్తుంది, అయితే ఇది అతివాద రూపాలు దాల్చకుండా చూడాలి.జాతీయవాదం పెరుగుతున్నప్పటికీ, దీనికి విరుద్ధంగా కులం, మతం ఆధారిత విభజనలు కూడా బలపడుతున్నాయి. రాష్ట్ర స్థాయి, జాతీయ ఎన్నికల్లో ఈ ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా సమాజాన్ని చీల్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇది కేవలం రాజకీయాలకే పరిమితం కాదు.. సామాజిక స్థాయిలో కూడా విష సంస్కృతిని ప్రోత్సహిస్తోంది. అంతేకాకుండా, ఉగ్రవాద కార్యకలాపాలు చిన్న పట్టణాలకు విస్తరిస్తున్నాయి. గతంలో పెద్ద నగరాలకే పరిమితమైన ఈ సమస్య, ఇప్పుడు గ్రామీణ మరియు చిన్న పట్టణాల్లోనూ వ్యాపిస్తోంది. వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు డిజిటల్ మాధ్యమాల ద్వారా విధ్వంసకర చర్యలకు పాల్పడుతున్నట్లు బయటపడుతోంది. ఈ విభజనలు సమాజ ఐక్యతను బలహీనపరుస్తాయి. ఇవి దీర్ఘకాలిక సవాళ్లను సృష్టిస్తాయి.దేశంలో మత ఆధారిత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. ప్రముఖ నగరాల్లో విదేశీ భావనలతో కూడిన నినాదాలు, చిహ్నాలు కనిపిస్తున్నాయి, ఇది దేశీయ ఐక్యతకు హానికరం. కొన్ని న్యాయస్థానాల తీర్పులు ఇలాంటి చర్యలకు మార్గం సుగమం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఫలితంగా అల్లర్లు, హింసాత్మక సంఘటనలు పెరుగుతున్నాయి. వివిధ రాష్ట్రాల్లో ఈ సమస్యలు తీవ్రమవుతున్నాయి. మత సంబంధిత చిహ్నాలు నినాదాలు హింసకు దారితీస్తున్నాయి. స్థానిక సంస్కృతి, పండుగలపై అభ్యంతరాలు లేవనెత్తడం ద్వారా ప్రభుత్వాలు కూడా జోక్యం చేసుకోవాల్సి వస్తోంది. ఈ ధోరణి మత సామరస్యాన్ని దెబ్బతీస్తుంది.. సమాజంలో భయాందోళనలను పెంచుతుంది .ఈ విద్వేషాల వెనుక కొన్ని విచ్ఛిన్నకర గ్రూపులు, బయటి ప్రభావాలు ఉన్నట్లు కనిపిస్తోంది.

పొరుగు దేశాల్లో రాజకీయ మార్పులు జరిగిన తరహాలో, భారతదేశంలో కూడా ఇలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయి. చిన్న గ్రూపులు స్థానిక స్థాయిలో ప్రభావం చూపుతూ, జాతీయ ఐక్యతను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నాయి. చారిత్రక ఘటనల సమయంలో కూడా ఇలాంటి నినాదాలు, చర్యలు కనిపిస్తున్నాయి, ఇది ఒక వ్యూహాత్మక ప్యాటర్న్‌ను సూచిస్తుంది. ఈ గ్రూపులు సమాజాన్ని విభజించడం ద్వారా దేశ స్థిరత్వాన్ని దెబ్బతీయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి ప్రభావాలు దీర్ఘకాలంలో దేశ భద్రతకు ముప్పు కలిగిస్తాయి.జాతీయవాదం, విచ్ఛిన్న శక్తుల మధ్య ఈ సంఘర్షణ దేశ భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. ఐక్యతను పటిష్టం చేస్తూ, విభజనలను అరికట్టడం అవసరం.

లడఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించినప్పుడు స్థానికులు ఆనందోత్సవాలు జరుపుకున్నారు. అయితే కొద్ది కాలంలోనే రాష్ట్ర హోదా కోసం డిమాండ్ ప్రారంభమైంది. ఇది సహజసిద్ధమైన స్థాని క హక్కుల పోరాటం కాకుండా, ప్రణాళికబద్ధమైన రాజకీయ తద్వారా అంతర్జాతీయ దష్టి ఆకర్షించాలనే ప్రయత్నం అని చెప్పవచ్చు. మెగసెసె అవార్డు గ్రహీత సోనమ్ వాంగ్‌చూ, ఈ ఉద్యమానికి ప్రధాన నాయకుడిగా ఎదిగారు. ఆయన నడిపిన సంస్థలకు లైసెన్స్ రద్దు కావడమే మొదటి ఘర్షణ. వాంగ్‌చూ తండ్రి కాంగ్రెస్‌కు చెందిన మాజీ మంత్రి కావడం వలన ఆయన రాజకీయ నేపథ్యం కూడా దృష్టిలో ఉంచుకోవాల్సిన అంశం. ఆయన సంస్థలకు ఇచ్చిన భూమి లీజు రద్దు తరువాత ఆయన క్రమంగా రాష్ట్ర హోదా ఉద్యమం మొదలు పెట్టారు. అయితే ఇక్కడ ప్రశ్న ఏమిటంటే - ఒక విద్యా, సాంస్కృతిక కార్యకర్త ఒక్కసారిగా ఎందుకు హింసాత్మక ఉద్యమానికి పూనుకుంటారు? సమాధానం - ఒకవైపు వ్యక్తిగత నష్టం, మరోవైపు రాజకీయ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్న వ్యూహం.లడఖ్ ఉద్యమాన్ని కేవలం స్థానిక అసంతృప్తిగా చూడటం తేలికైన నిర్ణయమే అవుతుంది. వాంగ్‌చూ ప్రసంగాలు శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లో జరిగిన అల్లర్ల తీరును పోలి ఉన్నాయని పరిశీలకులు చెబుతున్నారు. ఇక అరెస్ట్ అయిన వారిలో కొందరు నేపాల్‌కు చెందినవారు కావడం కూడా ఈ వాదనను బలపరుస్తోంది. చిన్నచిన్న ప్రాంతాల్లో హింస చెలరేగించడం ద్వారా ప్రపంచ మీడియా అటెన్షన్ పొందాలన్న గ్లోబల్ ప్రొటెస్టు మోడల్ ఇక్కడ ప్రయోగించినట్లు కనిపిస్తోంది.ప్రభుత్వాలు, సమాజం, విద్యా సంస్థలు కలిసి ఈ సవాళ్లను ఎదుర్కోవాలి. విచ్ఛిన్నకర శక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే సమతుల్యమైన సమాజాన్ని నిర్మించవచ్చు. ఇది కేవలం రాజకీయ సమస్య కాదు.. సామాజిక బాధ్యత కూడా..!



## కార్యకర్తలపై వద్దు

మాత్రమే దృష్టిలో ఉంచుకుని, సరైన ప్రదేశాలను ఎంచుకుని, పోలీసు శాఖ నుండి అనుమతి అడుగుతాము. కానీ ఊహించలేనిది జరిగిందన్నారు. బాధితుల్ని పరామర్శించకపోవడంపైన వస్తున్న విమర్శలపై స్పందించారు. తాను కూడా ఒక మనిషినే. చాలా మంది ప్రజలు ప్రభావితమైనప్పుడు నేను ఆ పట్టణాన్ని ఎలా వదిలి వెళ్ళగలను? నేను నిజంగా అక్కడికి తిరిగి వెళ్లాలనుకున్నాను. కానీ నేను అలా వెళితే, అక్కడ ఇతర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడకూడదు, కాబట్టి నేను అక్కడికి వెళ్లకుండా ఉండిపోయానని వివరణ ఇచ్చారు. ఈ సమయంలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన అన్ని కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. నేను ఎంత ఓదార్పు ఇచ్చినా, మీ నష్టాన్ని పూడ్చడానికి అది సరిపోదని నాకు తెలుసు. ఈ సమయంలో, ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని నేను ప్రార్థిస్తున్నాను. వీలైనంత త్వరగా మిమ్మల్ని కలుస్తాను. ఈ సమయంలో మా బాధను అర్థం చేసుకుని మా తరపున మాట్లాడిన రాజకీయ నాయకులు , స్నేహితులకు నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని విజయ్ తెలిపారు. కరూర్‌లో మాత్రమే ఇది ఎందుకు, ఎలా జరిగింది? ప్రజలకు అన్ని వాస్తవాలు తెలుసు. ప్రజలు అన్నీ చూస్తున్నారు. కరూర్ ప్రజలు నిజం చెప్పినప్పుడు, దేవుడే దిగి వచ్చి వారికి చెప్పినట్లు నాకు అనిపించింది. మా తప్పు లేదు, అన్ని వాస్తవాలు త్వరలో బయటపడతాయి. మాకు ఇచ్చిన ప్రదేశానికి వెళ్లి మాట్లాడటం తప్ప మా వైపు నుండి వేరే తప్పు లేదు. అయితే, నా పార్టీ కార్య నిర్వాహకులు నా సహచరులపై ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మీడియాలో నిజం చెప్పే సహచరులపై కూడా వారు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు. సిఎం సార్, మీకు కోపం ఉంటే లేదా ప్రతీకారం తీర్చుకునే ఉద్దేశ్యం ఉంటే, మీరు నాపై ఏమి చేయాలనుకుంటే అది చేయండి. కానీ పార్టీ కార్యకర్తలపై చేయి వేయకండని కోరారు. నేను ఇంట్లో లేదా పార్టీ కార్యాలయంలో ఒంటరిగా ఉంటానన్నారు. మా రాజకీయ ప్రయాణం బలం, ధైర్యంతో కొనసాగుతుందని విజయ్ చెప్పారు.

# తస్మాత్ జాగ్రత్త.. బరితెగిస్తున్న సైబర్ నేరగాళ్లు...!?

**0863 3541778, +919573521835, +918633541778, +918047364091, +918071075701, +911135047694, +918035049628, ఇలా ఫేక్ నెంబర్లతో మీ ఫోన్ టాప్ చేసి మీ సంబంధిత కుటుంబ సభ్యులను బెదిరింపు ధోరణికి దిగుతున్నారు. కర్మ కాలీ బ్యాంకులో లోన్ తీసుకుంటే ఇక మీరు సూసైడ్ చేసుకోవాల్సిందే.. 0863 3541778 ఈ నెంబర్ వెరీ డేంజర్ గా ఉండే నెంబర్ దీనితో మీకు కాల్ వచ్చినప్పుడు అస్సలు తీయకండి... జయభేరి సీనియర్ జర్నలిస్టుకే ఇంత అవమానీయ ఘటన జరుగుతున్నప్పుడు సమాజం మేల్కోవాలి. పర్సనల్ లోన్ తీసుకున్న పాపానికి బ్యాంకు వల్ల ఒత్తిడి అంతా ఇంత కాదు. కడతాం అని చెబుతున్న గంటకి కాల్ చేస్తూ మానసిక వేదనకు గురి చేయడం దేనికి సంకేతం!? డబ్బు అందక ఒకవైపు ఇంట్లో సమస్యలు ఇంకోవైపు హాస్పటల్ అనారోగ్య సమస్యలు ఇంకోవైపు ఇలా జరుగుతున్న ఇవి వాళ్ళకి ఏమి పట్టింపులు ఉండవు..**



✍ జయభేరి, హైదరాబాద్ :

హలో... కడారి శ్రీనివాస... ఆయన మీకు ఏమవుతాడు..? నా దగ్గర పది లక్షలు లోన్ తీసుకున్నాడు 500000కట్టాడు ఇంకా ఐదు లక్షలు కట్టాలి తప్పించుకు తిరుగుతున్నాడు? మీరు కచ్చితంగా కట్టాలి మీ ఆధార్ కార్డు ఉంది మీ ఇంటికి వస్తాం అంటూ... గత కొన్ని రోజులుగా నాకు సంబంధించిన అన్ని నెంబర్లకు కాల్ చేసి సైబర్ నేరగాళ్లు వేధిస్తున్నారు... ఇదే విషయంపై ప్రజలకు అవగాహన కలగాలని ఈ కథనం రాస్తున్న...

తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యంగా బరితెగిస్తున్న సైబర్ నేరగల పరిస్థితి తలుచుకుంటే పేద ప్రజల గుండెల్లో భయాందోళనలకు గురికావాల్సి వస్తుంది. అంతేకాదు మీవాడు మా బ్యాంకులో 10 లక్షలు తీసుకున్నాడు 500000 కట్టాడు ఇంకా ఐదు లక్షలు కట్టాలి అంటూ మీ ఆధార్ కార్డు నెంబర్ నా దగ్గర ఉంది మీ ఇంటికి మేము పదిమంది వస్తాం అంటూ నానా దుర్భాషలాడుతూ గ్రామీణ ప్రజలలో భయాందోళన గురి చేస్తున్నారు. ఇక అసలు విషయాల్లోకొస్తే రోజురోజుకు ఆధునిక సాంకేతిక జీవన రంగంలో అవలీలగా డబ్బు సంపాదన చేసుకోవడానికి ఎంతో మంది ఇలా సైబర్ నేరగాలిగా మారిపోయి పూర్తిగా మనం మాట్లాడే భాషలోనే మాట్లాడుతూ మనల్ని ఇరుకున పెట్టేసి భయాన్ని కల్పించేలా మాట్లాడుతూ నానా దుర్భాషలు ఆడతారు. ఇక సైబర్ నేరాలపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు అనేక విషయాలని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నప్పటికీ ఇవేవీ పట్టించుకోని సైబర్ రాక్షసులు పూర్తిగా సామాజిక మాధ్యమాల్లో పేరొందిన వారి నెంబర్లను పట్టుకోవడం లేదంటే తెలిసో తెలియకో సోషల్ మీడియాలో వచ్చే యాప్లను డౌన్లోడ్ చేసుకోవడం ద్వారా మన ఫోన్ నెంబర్ పూర్తిగా ట్రాక్ చేయబడి మన కాంటాక్ట్ నెంబర్లను వాళ్లు అంటే సైబర్ నేరగాళ్లు ట్రాప్ చేసి వాళ్లను బెదిరింపు దూరంలోకి దిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పైన చూపించిన ఈ నెంబర్ నుంచి మీకు ఎలాంటి సమాధానం చెప్పకపోవడమే దీనికి సరైన మందు... కాదు కూడదు అని ఫోను లిఫ్ట్ చేశారు అంతే మిమ్మల్ని మాటల్లో పెట్టేసి మీ దగ్గర నుంచే సమాధానాన్ని పట్టుకొని మిమ్మల్ని బెదిరింపు దూరానికి దిగుతూ డబ్బులు వసూలు చేసే సైబర్ నేరగాల నుంచి తప్పించుకోవాలి అంటే మనం వాళ్ళ ఫోన్ ని కట్ చేసి మాట్లాడకుండా ఉండడమే. ఇప్పుడు ఇదే క్రమంలో జయభేరి సీనియర్ జర్నలిస్ట్ కడారి శ్రీనివాస్ కు గత కొన్ని రోజులుగా పైన తెలిపిన నెంబర్ల నుంచి ఫోన్లు చేస్తూ యాక్సిస్ బ్యాంకు నుంచి పది లక్షలు లోన్ తీసుకున్నారు 500000 కట్టాలి... అంటూ నా ఫోన్ నెంబర్ ని తీసుకొని ట్రాప్ చేసి నా సంబంధిత బంధువులకు పూర్తిగా అసభ్య పదజాలంతో దూషిస్తూ వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీనిపై పోలీసులకు కంప్లైంట్ చేయడం జరిగింది పోలీసులు సైబర్ నేరాల కింద ఆ నెంబర్లపై నిగా ఏర్పాటు చేస్తున్నారు... ఒక జర్నలిస్టుగా సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉండే నాకే ఇంతగా ఫోన్లు వస్తున్నాయంటే నా ఫోన్ ని ట్రాప్ చేసి పూర్తిగా నా సంబంధిత కాంటాక్ట్ నెంబర్ల దగ్గర నుంచి అందరిని బెదిరింపు చేస్తూ లక్షల లక్షలు బ్యాంకుల నుంచి తీసుకున్నారని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వాళ్లను భయపెడుతూ వాళ్ల నుంచి డబ్బులు కాజేయాలని దురుద్దేశంతో ఇలాంటి సైబర్ మోసగాళ్లు తెగబడుతున్నారు. దీనికి సరైన అవగాహన ఒకటే మందు. మనకు తెలియని నెంబర్ల నుంచి ఎవరైనా అప్పు ఉంది అని చెప్పినప్పుడు వాళ్లతో వాదించకుండా ఫోన్ పెట్టేయడమే ఉత్తమం. అంతేకానీ వాళ్లతో వాగ్ వివాదానికి దిగవద్దు. ఒక్కసారి వారితో మనం సంభాషణ మొదలు పెడితే వాళ్లు సక్సెస్ అయినట్టే.. సామాజిక మాధ్యమాల్లో నుంచి ఎటువంటి యాప్ ని డౌన్లోడ్ చేసుకోకూడదు. అలా చేసుకున్నట్లయితే మీ ఫోన్ వెంటనే ట్రాప్ అయిపోయి సైబర్ నేరగాళ్ల వలలో మీరు చిక్కుకున్నట్టే అని అర్థం. ఒకవైపు ఆర్బీఐ నిబంధనల ప్రకారం పదేపదే ఆర్థిక ఇబ్బందులకు గురి చేయవద్దని నియమ నిబంధనలు చెబుతున్న ఇవేవీ వారికి చెవిన పట్టవు. కోర్టులను ఆశ్రయించడానికి అందరికీ అవగాహన ఉండదు. ఈ మధ్యన సామాజిక మాధ్యమాల్లో కొందరు అద్వకేట్లు ఇలా వచ్చిన వాటిపై అవగాహన కార్యక్రమం పెంచుతున్నప్పటికీ ప్రజల్లో ఇంకా చైతన్యం రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది... ఈ నెంబర్లతో వస్తే కనుక తస్మాత్ జాగ్రత్త ఎవ్వరు కూడా ఫోన్ ని లిఫ్ట్ చేయకుండా ఉండాలి. ఈ నెంబర్లపై సంబంధిత పోలీసు శాఖలో కంప్లైంట్ చేయడం జరిగింది వెంటనే దీనిపై విచారణ కూడా మొదలవుతోంది. కానీ సమాజం మేలుకోవాలి సైబర్ నేరాలను మనకు మనమే నియంత్రించుకునే ఒక సైబర్ వారియర్ గా ముందుకు నడుంకట్టి మన తోటి వారిని రక్షించే విధంగా మనం అవగాహన తీసుకురావడానికి కృషి చేయాలి.



✍ కడారి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్ (జయభేరి),
తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఎడిటోరియల్ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత, కవి, గాయకుడు, రచయిత, సామాజిక ఉద్యమకారులు

# జర్నలిస్ట్ కుటుంబానికి అండగా టియుడబ్ల్యూజే ఐజేయు

- జర్నలిస్టులకు అన్నివిధాల అండగా ఉంటా
- రాష్ట్ర కన్వీనర్ పేపర్ శ్రీనన్న
- జర్నలిస్ట్ భార్యకు చెక్కును అందజేసిన అఫీషియల్ రాష్ట్ర కమిటీ కన్వీనర్ (పేపర్ శ్రీనన్న)గుడిపల్లి శ్రీనివాస్



**జయభేరి, షాద్ నగర్, సెప్టెంబర్ 30 :**

జర్నలిస్టు కుటుంబాలకు మేమున్నామంటూ భరోసా కల్పించడంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ ముందుంటుందని మఫీషియల్ రాష్ట్ర కన్వీనర్ పేపర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం పేపర్ శ్రీనివాస్ నివాసంలో గత కొన్ని రోజుల క్రితం మృతి చెందిన నందిగామ మండలానికి చెందిన జర్నలిస్టు రమేష్ (ప్రజా కలం రిపోర్టర్ నందిగామ మండలం)భార్యకు తెలంగాణ మీడియా అకాడమీ సంక్షేమ నిధి నుండి మంజూరైన టీయూడబ్ల్యూజే (ఐజేయు) మఫీషియల్ రాష్ట్ర కమిటీ కన్వీనర్ పేపర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో లక్ష రూపాయల చెక్కుని అందజేశారు. ఈ సందర్భంగా పేపర్ శ్రీనివాస్ మాట్లాడుతూ యూనియన్ లో ఉన్న ఏ జర్నలిస్టుకు ఇబ్బందులు ఎవరైనా టియుడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ అండగా ముందుండి ఆదుకుంటుందని వెల్లడించారు. జర్నలిస్టు మృతి చెందితే వారి కుటుంబానికి ఇబ్బంది కలగవద్దనే ఉద్దేశంతో యూనియన్ ఆర్థిక భరోసాను కల్పిస్తుందని అన్నారు. మృతి చెందిన జర్నలిస్టు కుటుంబానికి తెలంగాణ మీడియా అకాడమీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వివరించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం మీడియా అకాడమీ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. మృతి చెందిన జర్నలిస్టు భార్యకు నెలకు 3000 పింఛన్ ఇవ్వడంతో పాటు ఇద్దరి పిల్లలకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున ట్యూషన్ ఫీజు కూడా తెలంగాణ మీడియా అకాడమీ సంక్షేమ నిధి నుండి అందించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా రంగారెడ్డి జిల్లా సంయుక్త కార్యదర్శి రాఘవేందర్ యాదవ్, ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ అధ్యక్షులు నరసింహ, ప్రింట్ మీడియా ఉపాధ్యక్షులు మల్లికార్జున్ నాయక్, సంతోష్ గుప్త, ప్రింట్ మీడియా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రమేష్, ఎలక్ట్రానిక్ మీడియా జనరల్ సెక్రటరీ ఫయాజ్, ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ ఉపాధ్యక్షులు శివకుమార్ గౌడ్, ప్రింట్ మీడియా ప్రధాన కార్యదర్శి నీరటి శివకుమార్, డివిజన్ సంయుక్త కార్యదర్శి అల్వాల దర్శన్ గౌడ్, జిల్లా ఈసీ మెంబర్ ఇలియాజ్, సాబేర్, డివిజన్ సంయుక్త కార్యదర్శి రాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు..



## మండపాల వద్ద పూజలు.. అన్నదాన కార్యక్రమం

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, కాప్రా :**

దసరా నవరాత్రి ఉత్సవాలల్లో భాగంగా మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ మల్లాపూర్ శాంతి యూత్ క్లబ్ వారు ఏర్పాటు చేసిన మండపం వద్ద, వి ఎన్ ఆర్ గార్డెన్స్ లో బగియ సంఘం వారు, కె ఎల్ రెడ్డి నగర్ లో బెంగలి అసోసియేషన్ వారు, భవాని నగర్ కాలనీ లో రవీందర్ యాదవ్ ఏర్పాటు చేసిన మండపాల వద్ద పూజలు నిర్వహించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి. అలాగే వివిధ మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ హౌసింగ్ బోర్డ్ కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, మండపల నిర్వాహకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొని అన్నప్రసాధాలు స్వీకరించారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బండారి




**జయభేరి, మల్లాపూర్ :**

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని డా బిఆర్ అంబేద్కర్ భవన్ మొదటి అంతస్తు కొరకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ (SDF) ధ్వారా నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమ (CDP) నిధులతో సుమారు రూ. 40 లక్షలతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో మీర్పేట్ హౌసింగ్ బోర్డ్ కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ గారు, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి గారు, డా. బిఆర్ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కర్రె శంకర్, ప్రధాన కార్యదర్శి మెండ రఘువరన్, పర్ణటీ నరేందర్, హనుమండ్ల విజయ్, జితేందర్, బాలచందర్, సందీప్, సాయి, శ్రీనివాస్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చదువులలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు సహకారం అందిస్తా..

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, ఉప్పల్ :**

ఉన్నత చదువులలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు అండగా ఉంటూ వారి కుటుంబాలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గ్రూప్ 2 పరీక్షలోఉత్తీర్ణత సాధించి ఏ ఎస్ ఓలా ఆఫీసర్ (తెలంగాణ సచివాలయం)గా ఎంపికైన ఎంపల్లి క్రాంతి రణ దేవ్ ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం శివ సాయి నగర్ లోని వారి నివాసంలో శాలువా కప్పి అభినందించారు.

## పిడుగుపాటుకు ఎద్దు మృత్యువాత



**జయభేరి, సి.బెళగల్:**

సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామంలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపుల వర్షంతో పిడుగుపడి ఓ ఎద్దు మృత్యువాత పడింది. మరొక ఎద్దు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు పోలకల్ గ్రామానికి చెందిన రైతు ఈరపోగు రంగన్న తన రెండు ఎడ్లను వర్షం కురుస్తుందని రాత్రి 11 గంటల సమయంలో మేత వేసి పశువుల పాకలో కట్టేశారు. ఉరుములు, మెరుపులతో పెద్ద శబ్దంతో ఎడ్ల సమీపంలో పిడుగు పడింది. ఈ ప్రమాదంలో ఒక ఎద్దు అక్కడికక్కడే మృత్యువాత పడింది. మరొక ఎద్దు తృటిలో ప్రాణాపాయం తప్పించుకుంది. కాగా మృత్యువాత పడిన ఎద్దు విలువ సుమారు 60 వేల రూపాయలు ఉంటుందని రంగన్న తెలిపారు. మంగళవారం ఉదయం పోలకల్ స్థానిక పశు వైద్యులు డాక్టర్ రిచర్డ్ మృతి చెందిన ఎద్దుకు పంచనామ నిర్వహించారు. పేద కుటుంబానికి చెందిన రైతు రంగన్నకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని స్థానికులు తెలిపారు.



## 42 శాతం రిజర్వేషన్ జివో చెల్లదు

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 30 :**

కోర్టులో చెల్లవని తెలిసినా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించి గందరగోళానికి గురి చేస్తున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్ విమర్శించారు. ఎవరిని మోసం చేయడానికి ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారని ఆయన ప్రశ్నించారు. హన్మకొండ జిల్లా కమలాపూర్‌లోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ, బీహార్, మహారాష్ట్రలలో రిజర్వేషన్లపై నమోదైన పలు కేసులను సుప్రీంకోర్టు కొట్టివేసిందని అన్నారు. ఎవరూ కోర్టుకు వెళ్లవద్దని ముగ్గురు మంత్రులు చెబుతున్నారని, కోర్టుకు వెళితే అభ్యంతరం ఏమిటని ప్రశ్నిస్తున్నానని ఈటల అన్నారు. ఎన్నికల్లో ఓటు కోసం డబ్బులు ఖర్చు పెట్టవద్దని రాష్ట్ర ఎన్నికల కమిషన్ చెబుతోందని అన్నారు. నల్గొండ జిల్లాలోని గిరిజన తండాల్లో బీసీలు లేకున్నా రిజర్వేషన్ ప్రకటించారని విమర్శించారు. తమ పార్టీ తరఫున శాసనసభలో, మండలిలో పూర్తిగా మద్దతు ఇచ్చామని అన్నారు. రిజర్వేషన్ల విషయంలో బీజేపీని అనవద్దని సూచించారు.

## తగ్గిన జీఎస్టీ ధరలపై అవగాహన సదస్సులు

**జయభేరి, తుగ్గలి :**

ప్రజల సంక్షేమం కొరకు కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ స్లాబులపై నాయకులు, అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పగిడిరాయి గ్రామంలో మంగళవారం రోజున మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు,గ్రామ టిడిపి నాయకులు ఈశ్వర్ రెడ్డి,మాజీ సర్పంచ్ గుండమ్మయ్య,పంచాయతీ కార్యదర్శి రాజు నాయక్ లు గ్రామంలో పర్యటించి ప్రజలు వినియోగించే వస్తువులపై తగ్గిన జిఎస్టి వివరాలను ప్రజలకు వివరించారు.ఏ ఏ వస్తువులపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించిందో ప్రజలకు వారు వివరించారు. తగ్గిన జిఎస్టి ధరలు అక్టోబర్ 22 నుంచి అమలులోకి వచ్చాయని వారు ప్రజలకు వివరించారు.ప్రజలందరూ పూర్వపు ధరలు,తగ్గిన జీఎస్టీ ధరలను గమనించాలని వారు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డీలర్ సుంకన్న,నాగార్జున,రాము,టిడిపి నాయకులు,కార్యకర్తలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక..

- ఓటర్ల తుది జాబితా ఇదే!

**జయభేరి, హైదరాబాద్ ;**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఓటర్ల తుది జాబితాను హైదరాబాద్ ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ మంగళవారం విడుదల చేశారు. నియోజకవర్గంలో మొత్తం 3,98,982 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో స్త్రీ లు 2,073,67 పురుషులు 1,91,590, ఇతరులు 25 మంది ఉన్నారు. సెగ్మెంట్ పరిధిలోని 139 లోకేషన్లలో 407 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎన్నికల షెడ్యూల్ అధికారికంగా విడుదల చేయాల్సి ఉంది.


## అమ్మవారి కృప ప్రజలందరికీ ఉండాలి

- అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



**జయభేరి, షాద్ నగర్, సెప్టెంబర్ 30 :**

అమ్మవారి కృప వల్ల ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం,ఇన్మూల్ నర్వ, షాద్ నగర్ పట్టణంలోని నెహ్రూ కాలనీ , రాఘవేంద్ర కాలనీ, వినాయక గంజ్, శ్రీనివాస పలు కాలనిలో అమ్మవారి విగ్రహాల మండపం వద్ద దుర్గాదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారికి ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డిని పలు మండపాల నిర్వాహకులు శాలువాలతో సన్మానించి ఘనంగా సత్కరించారు. ప్రత్యేక పూజ కార్యక్రమాల అనంతరం వేద పురోహితులు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డికి తీర్థప్రసాదాలు అందించి అమ్మవారి ఆశీర్వచనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి మాట్లాడుతూ;రాహు కేతువుల దోషాలు తొలగించే దుర్గాదేవి నవరాత్రుల్లో అతి ముఖ్యమైన అవతారమని, చిరకాల బాధల నుంచి ఉపశమనం పొందాలన్నా, దారిద్రం తొలగి ఐశ్వర్యాలతో తులతూగాలన్న, ఇహలోక పరలోక సుఖాలను పొందాలన్న దుర్గాష్టమి రోజున దుర్గాదేవి అమ్మవారికి పూజలు నిర్వహిస్తే శుభ ఫలితాలు ఉంటాయని, శక్తికి ప్రతీక అయిన అమ్మవారిని పూజిస్తే తన శక్తితో అందరికీ సుఖ సంతోషాలు ప్రసాదిస్తారని, ఆయురారోగ్యాలు కలగజేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు ఈశ్వర్ రాజు, కానుగు అనంతయ్య, మానస యాదగిరి,జూపల్లి కౌసల్య శంకర్, పిల్లి శారద శేఖర్ మాజీ కౌన్సిలర్ పాలమాకుల చెన్నయ్య, నాయకులు రేకొండ రవీందర్ రెడ్డి, వేణుగోపాల్, ఎర్ర అంజయ్య రామేశ్వర్ గౌడ్, బిలాల్, చింతలపల్లి రాజేందర్ రెడ్డి, అశోక్, ప్రభాకర్, సతీష్, రాజ రామేశ్వర్ రెడ్డి, ఏదిర శ్రీకాంత్ గౌడ్, యువసత్త లక్ష్మణ్, శ్రీశైలం(లడ్డు) గౌడ్, చందు, ప్రదీప్, రమేష్, స్వామి, శ్రీనివాస్ గౌడ్, అష్రఫ్, మహమ్మద్ సాదక్, తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ సిబ్బందికి దసరా కానుక

- దసరా కానుక అందజేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- కమిషనర్ సునీత రెడ్డి ఆధ్వర్యంలో అందిన నగదు.
- ఆనందం వ్యక్తం చేసిన మున్సిపల్ సిబ్బంది.



**జయభేరి, షాద్ నగర్, సెప్టెంబర్ 30 :**

పట్టణ పురవీధుల్లో నిరంతరం శ్రమించే మున్సిపల్ సిబ్బందికి ఎమ్మెల్యే శంకర్ వరాల జల్లు కురిపించారు. వారి కష్టానికి కన్నీళ్ళకు తోడుగా దసరా పండుగ సందర్భంగా ఓ కానుకను ఇస్తానని మూడు నెలల కింద షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వారికి హామీని ఇచ్చారు. ఆ పదం ఒక భరోసాగా... ఆ హామీ ఒక ఆశగా... కార్మిక మనసుల్లో ఒక కోరికగా నిలిచింది... నేడు వారందరి కోరికను తీరుస్తూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ 140 మంది మున్సిపల్ సిబ్బందికి 2000 చొప్పున దసరా కానుకను అందజేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సునీత రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందికి కనుకలను అందజేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై సిబ్బందికి దసరా కానుకను అందజేశారు. అదేవిధంగా తమ డిపార్టుమెంటులో ఉత్తమ సిబ్బంది 6 6 మందికి 5000 చొప్పున ప్రోత్సాహకాని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మున్సిపల్ సుందరీకరణకు నిరంతరం కృషి చేస్తున్న సిబ్బంది సేవలు వెలకట్టలేనివని, అమ్మ కంటే గొప్పోళ్ళుగా నిలుస్తారని అన్నారు. అలాంటి కార్మికులకు తన వంతుగా సహాయం అందజేయాలనే ఉద్దేశంతోనే 140 మంది మున్సిపల్ సిబ్బందికి 2000 చొప్పున దసరా కానుక అందజేయాలని అనుకున్నానని, ఆ మేరకే నేడు వారికి అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు పిల్లలు మించితే అనర్హతే

**జయభేరి, వరంగల్, సెప్టెంబర్ 30:**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నిలకు నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి (ఎస్ఈసీ) రాణికుముదిని ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. రాష్ట్రంలో తొలుత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు రెండు దశల్లో జరగనుండగా.. ఆ తరువాత మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం ఐదు దశల్లో స్థానిక సంస్థల ఎన్నికలను ఎస్ఈసీ నిర్వహించనుంది.రాష్ట్రంలోని 31 జిల్లాల్లోని 565 మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 5,749 ఎంపీటీసీ, 565 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు, 12,733 గ్రామ పంచాయతీలు, 1,12,288 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 1,67,03,168 మంది ఓటర్లు ఉండగా.. వారిలో పురుష ఓటర్లు 81,65,894.. మహిళా ఓటర్లు 85,36,770, ఇతరులు 504 మంది ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం పేర్కొంది. అయితే, ఈ ఎన్నిల్లో ముగ్గురు పిల్లలు కలిగిన వారికి పోటీచేసే అవకాశం లేదు.ఇద్దరు పిల్లలు కన్నా ఎక్కువ మంది ఉంటే స్థానిక ఎన్నికల్లో పోటీకి అనర్హులు అనే నిబంధనను తొలగించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది ఈ నిబంధనను ప్రభుత్వం తొలగిస్తుందని ఎదురు చూశారు. అదికాస్త జరగకపోవడంతో.. ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న ఒత్తిళ్ల మేరకు ఈ నిబంధనను ఎత్తివేసి ఎంత మంది పిల్లలు ఉన్నా పోటీ చేయవచ్చుననే నిబంధన అమల్లోకి తెచ్చేలా ప్రభుత్వం కసరత్తు చేసింది. అయితే, ప్రస్తుతం జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు ఉన్నవారు పోటీచేసే అవకాశం కల్పిస్తారని భావించిన వారికి నిరాశే ఎదురైంది. తెలంగాణలో ముగ్గురు పిల్లల నిబంధనలో ఎలాంటి మార్పు చోటు చేసుకోలేదు. ఏపీలో ముగ్గురు పిల్లల నిబంధనలో మార్పులు చేశారు. ప్రభుత్వం ముగ్గురు పిల్లల నిబంధనను ఎత్తివేసింది. ఆ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు, అంతకన్నా ఎక్కువ మంది పిల్లలను కలిగినవారు కూడా పోటీచేయొచ్చు. గతేడాది నవంబర్ నెలలో.. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నాసరే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అవకాశం కల్పించే చట్ట సవరణ బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపింది. దీంతో ఏపీలో ముగ్గురు పిల్లల నిబంధనను తొలగిపోయింది. అధిక జనాభాను నియంత్రించే క్రమంలో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1994 మే30వ తేదీ నుంచి ముగ్గురు పిల్లల నిబంధన అమల్లోకి వచ్చింది.



## డాక్టర్ చెన్న కిష్టయ్య ను పరామర్శించిన ఆర్టిఐ కమీషనర్

**జయభేరి, తుర్కపల్లి, సెప్టెంబర్ 30:**

తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అంబటి చెన్న కిష్టయ్య తల్లి అంబటి శివరత్నమ్మ మరణించడంతో ఆయనను ఆర్టిఐ కమీషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బోరెడ్డి జ్యోతి పాల్గొన్నారు

## మహా రుద్రయాగ కమిటీని సన్మానించిన సోదా రామకృష్ణ



**జయభేరి, పరకాల, సెప్టెంబర్ 30:**

పరకాల పట్టణంలో నవంబర్ 3 సోమవారం రోజున శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానం ఆలయంలో కార్తీక మాస మహా రుద్రయాగ మహోత్సవం ఏర్పాటు చేయగా పరకాల పట్టణ కాంగ్రెస్ సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ ని హనుమకొండలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన మహా రుద్రయాగ కమిటీ సభ్యులు. ఈ మహా రుద్ర యాగానికి నా వంతు సహకారాలు అందిస్తానని, ఈ యాగానికి కావలసిన సౌండ్ సిస్టం ఏర్పాటు చేస్తానని, కమిటీ సభ్యులను సన్మానించిన జరిగింది. ఈ కార్యక్రమంలో మహా రుద్ర యాగ కమిటీ సభ్యులు కుంకుమేశ్వర ఆలయ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, ఎర్రం లక్ష్మణ్, పిట్ట వీరస్వామి, పంచగిరి శ్యామ్, గందె రవి, ఆలయ డైరెక్టర్ తోట రవి తదితరులు పాల్గొన్నారు.

## వెంతేన ఇరువైపులా రోడ్డు నిర్మాణం



**జయభేరి, ఘట్కేసర్ :**

ఘట్కేసర్ మున్సిపల్ పట్టణ పరిధి రైల్వే రోడ్డు వంతెన నిర్మాణంలో భాగంగా వెంతేన ఇరువైపులా రోడ్డు నిర్మాణం కోసం చేస్తున్న పనులను పరిశీలిస్తున్న ఘట్కేసర్ మున్సిపల్ మాజీ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్. ఈ సందర్భంగా మాజీ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ వంతెన నిర్మాణంలో భాగంగా రోడ్డు ఇరు వైపులా BT రోడ్డు ఏర్పాటు చేయుటకి ప్రారంభించిన పనులని పరిశీలిస్తున్నాం అని అతి త్వరలో దసరా పండుగ తర్వాత వంతెన ఇరు వైపులా HDRC అధికారులు రోడ్డు ఏర్పాటు చేస్తారని కావున ప్రజలు అందరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేష్, యూత్ అధ్యక్షుడు బొక్క సంజీవ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రఫీ తదితరులు పాల్గొన్నారు.

## మాట ఇస్తే నిలుపుకోవడం కాంగ్రెస్ కే సాధ్యం

- తెలంగాణ మొదలు బీసీ రిజర్వేషన్,లు ఇందుకు ఉదాహరణం
- బీజేపీ, బీఆర్ ఎస్ లు ఒకటేనని కలిసి సంసారం చేస్తన్నాయి
- మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిన బీఆర్ ఎస్ నాయకులు
- స్థానిక ఎన్నికల్లో 80%శాతంకు పైగా సీట్లు గెలుచుకుంటాం
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**జయభేరి, హైదరాబాద్ సెప్టెంబర్ 30**

మాట ఇస్తే నిలుపుకోవడం కాంగ్రెస్ కే సాధ్యమని టీపీసీసీ అధ్యక్షులు, మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం గాంధీ భవన్లో జరిగిన మీడియా సమావేశంలో అయన మాట్లాడారు. తెలంగాణ మొదలు బీసీ రిజర్వేషన్,లు ఇందుకు ఉదాహరణంగా అయన పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ అనేది కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన కమిట్మెంట్ గా మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. బీజేపీ, బీఆర్ ఎస్ లు ఒకటేనని కలిసి సంసారం చేస్తున్నాయని తెలిపారు. అవి రెండు ఒకటై కుట్ర పూరితంగా కాంగ్రెస్ పై విష ప్రచారం చేస్తున్నాయని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. బాకీ కార్డు అంటూ కేటీఆర్ చేస్తున్న ప్రచారం పట్ల ప్రజలు నవ్వుకుంటున్నారని, వారి హయాంలో చేసిన అప్పులకు తాము మిత్తిలు కడుతున్నామని పేర్కొన్నారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిన బీఆర్ ఎస్ నాయకులు బకాయి అనే పదం ఎత్తే అర్హత లేదన్నారు. నిరుద్యోగుల కలలు సాకారం, సబ్సిడీ తో గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పెంచడం, రుణమాఫీ, రైతు భరోసా, వరికి బోనస్, రేషన్ కార్డు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇల్లు, వంటి సంక్షేమ కార్యక్రమాలు పజలకు అందించడం బాకీ పడ్డట్టా అని అయన ప్రశ్నించారు. కాళేశ్వరం, ఈ కార్ రేస్, స్కాంలో దొరకడంతో బీఆర్ఎస్ నాయకులకు దిక్కుతోచక బకాయి కార్డు పేరుతొ మోసపూరిత ప్రచారం చేస్తున్నారని అయన ఆరోపించారు. ఎరువుల పేరిట కేంద్రంలోని బీజేపీ మోసం చేస్తుందని విమర్శించారు. ప్రజల మనస్సులో కాంగ్రెస్ ఉందని, స్థానిక ఎన్నికల్లో 80%శాతంకు పైగా సీట్లు గెలుచుకుంటామని చెప్పారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందనే దీమాను అయన వ్యక్తం చేశారు. హైడ్రా పై అపోహలు వద్దని పేర్కొన్న అయన హైడ్రాను అభినందించారు.

# ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

- ముఖ్యఅతిధిగా పాల్గొన్న మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవిగౌడ్

**జయభేరి, మేడిపల్లి, సెప్టెంబర్ 30 :**



బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలోని చెంగిచెర్ల జై శ్రీరామ్ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సద్దుల బతుకమ్మ పండుగను అంగరంగ వైభోగంగా నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలకు ముఖ్యఅతిధిగా బోడుప్పల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవిగౌడ్ పాల్గొని కాలనీ మహిళాలతో కలసి బతుకమ్మ ఆడి పాడారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవి గౌడ్ లను శాల్వాతో ఘనంగా సన్మానించారు అనంతరం కొత్త లక్ష్మి రవి గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తి శ్రద్ధలతో తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా జరుపుకునే బతుకమ్మ పండుగకు విచ్చేసి బతుకమ్మ ఆడిన మహిళలందరికి



కృతజ్ఞతలు తెలియచేసారు. ప్రతి సంవత్సరంలాగానే ఈసారికూడా బతుకమ్మ పండుగ ఉత్సవాలను పెద్దఎత్తున నిర్వహించుకునేందుకు సహకరించిన ప్రతిఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో జై శ్రీరామ్ కాలనీ అధ్యక్షులు ఆర్ పి గౌడ్, వైస్ ప్రెసిడెంట్ రాజేందర్ రెడ్డి,జనరల్ సెక్రటరీ పి. సత్యనారాయణ, ట్రెజర్ వెంకట్ రెడ్డి,జాయింట్ సెక్రటరీ దామోదర్ రెడ్డి, కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, డివిజన్ నాయకులు, మహిళాలలు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రేస్ సేవాదల్ జెండా పండుగ

- బొచ్చు చందర్, కాంగ్రేస్ సేవాదల్ జిల్లా అధ్యక్షులు

**జయభేరి, పరకాల, సెప్టెంబర్ 30:**



కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో జెండా పండుగని రాష్ట్ర కాంగ్రెస్ సేవ దళ్ అధ్యక్షులు మిద్దెల జితేందర్ ఆదేశాల మేరకు ప్రతినెల చివరి రోజునజెండా పండుగ ఆవిష్కరించడం జరుగుతుందని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ సేవ దళ్ అధ్యక్షులు బొచ్చు చందర్ తెలిపారు. అందులో భాగంగా మంగళవారం హనుమకొండలోని బాలసముద్రం నందు హన్మకొండ జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు బొచ్చు చందర్ జెండా పండుగను నిర్వహించినారు. ఈ సందర్భంగా బొచ్చు చందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు సముద్రాల సోమయ్య, రాష్ట్ర సేవాదళ్ ఇన్స్పెక్టర్ పల్లపు యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షులు నిట్టె బాలరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు గోవిందు, జిల్లా జనరల్ సెక్రెటరీ తాటికొండ ప్రసాద్, హనుమకొండ కాంగ్రెస్ సేవాదళ్ నియోజ వర్గ అధ్యక్షులు తాళ్లపల్లి రాజు, పెద్దమ్మ గడ్డ మాజీ కార్పొరేటర్ రాజేందర్, పరకాల బ్లాక్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు పల్లి రామస్వామి, పరకాల మండల కాంగ్రెస్ సేవా దళ్ అధ్యక్షులు ధూమాల కిషోర్, బొచ్చు అనిల్ బొచ్చు, రాజు, శ్రీధర్ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బహుళ సామజిక వర్గాలు ఉన్న చోట ST రిజర్వేషన్ ఇస్తే ఇచ్చారు

- ఎస్టి లు మాత్రమే ఉన్న చోట జనరల్ ఎందుకు?
- పేరుకు మిగతా సామాజిక వర్గాలకు అవకాశం ఇచ్చామని చెప్పుకోవడానికా?

**జయభేరి, చర్ల, సెప్టెంబర్ 30 :**



చర్ల మండల కేంద్రంలోని బహుజన్ సమాజ్ పార్టీ కార్యాలయం లో మంగళవారం ముఖ్య నాయకుల సమీక్షా సమావేశం పార్టీ మండల నాయకులు కొండా కౌశిక్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా బహుజన్ సమాజ్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు తడికల శివకుమార్ పాల్గొని మాట్లాడుతూ చర్ల మండల పరిధిలోనీ పలు ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో ఎస్టీ గ్రామాలు ఉన్నాయని అలాంటి ప్రాంతాలలో స్థానిక ఎన్నికల్లో భాగంగా జనరల్ స్థానాలు ఎలా చేస్తారని ఆయన ప్రశ్నించారు. అన్ని కులాల వారు కలిసి ఉన్న ప్రాంతాలలో ఎస్టీ రిజర్వేషన్ ని ఎలా ఖరారు చేస్తారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇది కచ్చితంగా స్థానిక అధికారుల తప్పిదమేనని బహుజన సమాజ్ పార్టీ భావిస్తుందన్నారు. ఇట్టి విషయమై జిల్లా కలెక్టర్ స్పందించాలని ఏ జనాభా ఎక్కువ ఉందో ఆ జనాభా కి ఆ రిజర్వేషన్ కేటాయించాలని ఆయన కలెక్టర్ ని డిమాండ్ చేశారు.తక్షణమే స్థానిక ఎన్నికల రిజర్వేషన్ నూ మరల తిరిగి రీ సర్వే నిరీహించి ఈ సమస్యను పరిష్కరించాలని అయన కలెక్టర్ నూ కోరారు. ఈ కార్యక్రమం లో మండల నాయకులు చెన్నం మోహన్, బాషా, గుర్రాల విజయ్, చెన్నం పవన్,శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు చేసిన సేవలే నాకు ఆదర్శం

- వీర్ సావర్కర్ యువజన మంచ్ ఆధ్వర్యంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన - త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి

**జయభేరి, గడ్డిఅన్నారం :**



దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీలో వీర్ సావర్కర్ యువజన మంచ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీ దుర్గాదేవి ప్రత్యేక పూజా కార్యక్రమానికి త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ ని వీర్ సావర్కర్ యువజన మంచ్ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం గవర్నర్, వీర్ సావర్కర్ యువజన మంచ్ ఫౌండర్, గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి నివాసంలో నిర్వహించిన తేనేటి విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. తాను శాసనసభ్యుడిగా ఉన్న కాలంలో గడ్డిఅన్నారం మున్సిపాలిటీ చైర్మన్గా కీ||శే|| బద్దం సుభాష్ రెడ్డి ప్రజలకు చేసిన విశేష సేవలను గుర్తుచేసుకున్నారు. అలాగే ప్రస్తుత కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ప్రజలతో మమేకమై, అభివృద్ధి కార్యక్రమాలను దృఢంగా ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ..నాన్న కీర్తిశేషులు బద్దం సుభాష్ రెడ్డి గడ్డిఅన్నారం ప్రజలకు చేసిన సేవలే నాకు ఆదర్శం. అలాగే గవర్నర్ ఇంద్రసేనారెడ్డి కూడా రాజకీయ రంగంలో నాకు ప్రేరణ. ఈ ఇద్దరి ఆశీస్సులు, మార్గదర్శకత్వం నాకు ఎల్లప్పుడూ దిశానిర్దేశం చేస్తుంటాయి. వారి స్ఫూర్తితోనే నేను గడ్డిఅన్నారం డివిజన్లో అభివృద్ధి పనులను మరింత ఉత్సాహంగా ముందుకు తీసుకెళ్తాను. ఈ కార్యక్రమంలో వీర్ సావర్కర్ యువజన మంచ్ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, యువత, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితుడి అరెస్ట్

**జయభేరి, భద్రాచలం:**

ఆదివారం మధ్యాహ్నం చింతూరు నుండి హర్యానాకు కారులో అక్రమంగా గంజాయి తరలిస్తుండగా, బూర్గంపాడు ఎస్సై ప్రసాద్ తన సిబ్బందితో మొరంపల్లి బంజర గ్రామం దగ్గర పట్టుకున్నారు. కారులో నిందితుని నుండి 204.930 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు హర్యానా రాష్ట్రానికి చెందిన సంజీవ్ కుమార్ తన కార్ ఓనర్ అయిన ప్రిన్స్ కుమార్ ఆదేశాల ప్రకారం చింతూరు వైపు వెళ్లి అక్కడ ప్రధాన్ ఖారా, లఖన్ హంతాల్ వద్ద గంజాయి లోడ్ చేసుకొని తిరిగి హర్యానా వెళుతుండగా దొరికిపోయాడు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ కు తరలించారు.

## నదిలో దూకిన యూ ట్యూబర్

**జయభేరి, సంగారెడ్డి:**

చౌటకూర్ (మం) శివ్వంపేట వద్ద మంజీరా నదిలో యూ ట్యూబర్ దూకాడు. కారులో వచ్చి ఒక్కసారిగా నదిలో దూకి గల్లంతు అయ్యాడు. వీడియో సీసీ కెమెరాలో రికార్డ్ అయింది. గల్లంతైన వ్యక్తి జోగిపేట ఇందిరా నగర్ కాలనికి చెందిన లోకేష్ గా గుర్తించారు. మృతుడు గత సంవత్సరం నుంచి ఓ యూట్యూబ్ ఛానల్ ను నడిపిస్తున్నాడు.

## వంతెన ప్రహరీ గోడను ఢీకొని వేలాడుతున్న లారీ

**జయభేరి, ఒంగోలు:**

చెన్నై నుంచి కంభంకు అల్లం లోడ్తో వెళ్తూ లారీ అదుపు తప్పి వంతెన ప్రహరీ గోడను ఢీకొట్టి బయటకు వేలాడుతూ ఆగింది. కొమరోలు మండలం తిమ్మారెడ్డిపల్లెఅల్లినగరం మధ్య ఘటన జరిగింది. పెను ప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.

## ఏపీలో పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరిక

**జయభేరి, విజయవాడ:**

రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ రాష్ట్రంలో పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరికలు జారీ చేసింది. పలు జిల్లాల్లో భారీ వర్షాలను అవకాశం వుంది. అల్లూరి, అనకాపల్లి, కాకినాడ జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. తీరం వెంబడి 4050 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అంచనా వేసింది.

## వృద్ధ మహిళ ఇంట్లో భారీ చోరీ

**సూర్యాపేట:**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కృష్ణా నగర్ కాలనీలో దారుణమైన చోరీ జరిగింది. ఓ వృద్ధ మహిళ ఇంట్లో నుంచి సుమారు 40 తులాల విలువైన బంగారు బిస్కెట్లు సహా రూ. 8 లక్షల నగదు మాయమయ్యాయి . ఒంటరిగా ఉన్న మహిళను లక్ష్యంగా చేసుకుని ఈ చోరీ జరగడం స్థానికంగా కలకలం రేపింది . కుటుంబ సభ్యులు ఈ చోరీ వెనుక ఇంటిలో వృద్ధురాలి దగ్గర కేర్ టేకర్గా పనిచేస్తున్న మహిళ పైనే తీవ్ర అనుమానం వ్యక్తం చేస్తున్నారు . గత మూడు నెలలుగా వృద్ధురాలి వద్ద కేర్ టేకర్గా పనిచేస్తున్న కరీమా బేగం అనే మహిళ పైనే ప్రధానంగా అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదు చేయడంతో సమాచారం అందుకున్న సూర్యాపేట పట్టణ పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు . అనుమానితురాలైన కరీమా బేగంను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు . ఈ భారీ చోరీకి సంబంధించి క్లూస్ టీమ్ మరియు డాగ్ స్క్వాడ్ బృందాలతో పోలీసులు ఇంట్లోనూ, పరిసర ప్రాంతాల్లోనూ ఆధారాలు సేకరిస్తున్నారు.



# ఓజీలో అకీరా

## నటించకపోవడానికి అసలు కారణం ఇదా..

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన తాజా చిత్రం ‘OG’ బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్నిసాధించింది. ప్రముఖ దర్శకుడు సుజీత్ దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ డ్రామా సినిమా, విడుదలైన మొదటి వీకెండ్‌లోనే వరల్డ్‌వైడ్‌గా రూ.255 కోట్లకు పైగా వసూళ్లు సాధించి బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది.ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ గ్యాంగ్‌స్టర్‌గా సరికొత్త అవతారంలో కనిపించగా, ఆయన నటనకు విమర్శకుల ప్రశంసలు లభిస్తున్నాయి. అయితే సినిమాలో పవన్ చిన్న వయసు పాత్రలో అఖీరా నందన్ కనిపిస్తాడని సినిమా రిలీజ్‌కి ముందు అనేక ప్రచారాలు సాగాయి. అయితే చిత్రం రిలీజ్ అయ్యాక అకీరా లేకపోడంతో ఫ్యాన్స్ అప్సెట్ అయ్యారు. అయితే అకీరా ఎందుకు కనిపించలేదని అభిమానులలో చర్చ మొదలైంది.

# గూస్ బంప్స్ తెప్పిస్తున్న లిరిక్స్



సూపర్ హిట్ కాంతార సినిమాకు ప్రీక్వెల్‌గా రూపొందిన ‘కాంతార చాప్టర్ 1’ చిత్రం మరి కొద్ది గంటలలో థియేటర్స్‌లోకి రానుంది. హోంబలే ఫిలింస్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మాణంలో, రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో రూపొందిన ఈ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ కూడా భారీ హిట్ కొడుతుందనే ఆశాభావంతో మేకర్స్ ఉన్నారు. కాంతార చాప్టర్ 1’ కు 169 నిమిషాల నిడివి (2 గంటలు 49 నిమిషాలు)గా సీబీఎఫ్‌సీ అనుమతి ఇచ్చింది. ఇది ఇటీవల కాలంలో వచ్చిన అధిక నిడివి కలిగిన కన్నడ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ సినిమా కర్ణాటకలోని కదంబ వంశానికి చెందిన 4వ శతాబ్దం కాలపు పౌరాణిక నేపథ్యంతో సాగుతుంది.



# ఈడీ విచారణకు హాజరైన ఊర్వశి రౌతేలా

బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన కేసులో విచారణకు రావాలని ఈడీ ఊర్వశి రౌతేలాకి ఈనెల 15న సమన్లు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి చేరుకుంది ఉర్వశి. ఈ విచారణలో భాగంగా.. బెట్టింగ్ యాప్‌ల ప్రచారం వాటితో ఉర్వశికి ఉన్న సంబంధాలు ప్రచారానికి తీసుకున్న డబ్బుల గురించి అధికారులు ఆయనను ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటికే పలువురు సినీ, క్రీడా ప్రముఖులను ఈడీ విచారించింది. ఇటీవల సురేశ్ రైనా, యువరాజ్ సింగ్, నటి మంచు లక్ష్మి, నటుడు విజయ్ దేవరకొండ, రానా, ప్రకాశ్ రాజ్, సోను సూద్ కూడా విచారణకు హాజరయ్యారు. చట్టవిరుద్ధమైన బెట్టింగ్ కార్యకలాపాలను ప్రోత్సహించడం, నల్లధనం లావాదేవీలకు సంబంధించిన ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఇందులో భాగంగానే పలువురు సెలబ్రిటీలను ఈడీ ప్రశ్నిస్తోంది.



# కట్ చేస్తే అదే బ్రాండ్‌కు అంబాసిడర్ ఈ భామ..

చేసింది తక్కువ సినిమాలే అయినా క్రేజ్ మాత్రం పీక్. ఆమె ఎవరో కాదు అందాల భామ శోభిత దూళిపాళ్ల. డైరెక్టర్ మణిరత్నం తెరకెక్కించిన పొన్నియన్ సెల్వన్ సినిమాతో పాన్ ఇండియా స్టార్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు హీరోయిన్ శోభిత ధూళిపాళ్ల. అంతకు ముందు గూఢచారి సినిమాతో మంచి విజయాన్ని అందుకుంది. తెలుగుతోపాటు.. తమిళంలోనూ వరుస చిత్రాలు చేస్తూ బిజీగా ఉన్న ఈ ముద్దుగుమ్మ.. ఇటీవలే అక్కినేని యంగ్ హీరో నాగ చైతన్యను వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే గతంలో శోభితా చేసిన కామెంట్స్ ఇప్పుడు మరోసారి వైరల్ గా మారాయి.. తన జీవితంలో ఎదురైన చేదు సంఘటనలను గుర్తుచేసుకుంది శోభిత. ఒకప్పుడు అందంగా.. ఆకర్షణీయంగా లేనని ప్రముఖ బ్రాండ్ తనను బ్యాగ్రౌండ్ మోడల్‌గా కూడా సెలక్ట్ చేయలేదని తెలిపింది.. కానీ మూడేళ్ల తర్వాత అదే బ్రాండ్‌కు తాను బ్రాండ్ అంబాసిడర్‌గా సంతకం చేసినట్లు అప్పటి రోజులను గుర్తుచేసుకుంది. శోభితా మాట్లాడుతూ.. “నేను అందంగా.. ఆకర్షణీయంగా లేనని నన్ను కేవలం బ్యాగ్రౌండ్ మోడల్‌గా కూడా సెలక్ట్ చేయలేదు. కానీ మూడేళ్ల తర్వాత అదే బ్రాండ్‌కు నేను బ్రాండ్ అంబాసిడర్‌గా సైన్ చేశాను. ఐశ్వర్య రాయ్ బచ్చన్‌తో షాంప్స్ యాడ్ కూడా చేశాను. చాలా సంతోషంగా ఉంది” అంటూ చెప్పుకొచ్చింది. ఈ కామెంట్స్ ఇప్పుడు మరోసారి వైరల్ గా మారాయి.

# రిటైర్మెంట్ రోజే పోలీస్ మర్డర్..

## ఓటీటీలో దూసుకెళుతోన్న ఇంటెన్స్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ



ఓటీటీలో మలయాళం సినిమాలకు ఉన్న ఆదరణ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అందులోనూ క్రైమ్, సస్పెన్స్, హారర్, థ్రిల్లర్ సినిమాలైతే ఎగబడి మరీ చూస్తున్నారు ఆడియెన్స్. ఇప్పుడు మనం మాట్లాడుకోబోయేది కూడా ఒక మలయాళం క్రైమ్ మిస్టరీ థ్రిల్లర్ సినిమానే. కొన్ని రోజుల క్రితం థియేటర్లలో విడుదలైన ఈ మూవీ మలయాళం ఆడియెన్స్‌ను బాగా ఆకట్టుకుంది. ఆసక్తికరంగా సాగే కథా కథనాలు, గ్రిప్పింగ్ స్క్రీన్ ప్లే, మధ్యలో వచ్చే ట్విస్టులు మలయాళం ప్రేక్షకులకు మంచి థ్రిల్ అందించాయి. సుమారు 1 గంట 46 నిమిషాల క్రిస్పీ రన్‌టైమ్ తో సాగే ఈ మూవీకి ఐఎమ్‌డీబీలోనూ మంచి రేటింగ్ దక్కడం విశేషం. ఈ సినిమా కథంతా కేరళలోని ఒక పట్టణం చుట్టూ తిరుగుతుంది. సైమన్ అనే ఒక సీనియర్ పోలీస్ అధికారి తన రిటైర్మెంట్ రోజేన హఠాత్తుగా మరణిస్తాడు. చాలా మంది ఇది సాధారణ మరణం అనుకుంటారు. మరికొంతమంది ఆత్మహత్య అని భావిస్తారు. అయితే అతని మరణం వెనక ఓ మిస్టరీ ఉందని పోలీసులకు అనుమానం వస్తుంది. దీంతో ఈ కేసును దర్యాప్తు చేయడానికి మరో సిన్సియర్ ఐపీఎస్ అధికారి లాల్ మోహన్ రంగంలోకి దిగుతాడు. అతను కూడా సైమన్ మరణంలో ఏదో తప్పు ఉందని భావిస్తాడు. దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ సైమన్ జీవితంలోని రహస్యాలను, అతని శత్రువుల గురించి లాల్ మోహన్ తెలుసుకుంటాడు. సైమన్ మరణం ఆత్మహత్య కాదని, పక్కా ప్లానింగ్ మర్డర్ అని తెలుస్తుంది. ఇలా దర్యాప్తు కొనసాగుతుండగానే జీవ అనే క్రిమినల్ జైలు నుంచి తప్పించుకుంటాడు. గతంలో జీవ, సైమన్‌కి మధ్య గొడవలు జరిగినట్లు లాల్ మోహన్ తెలుసుకుంటాడు.ఈ క్రమంలో వచ్చే ట్విస్టులు సినిమాను మరింత ఆసక్తికరంగా మారుస్తాయి. సైమన్ భార్య షైని, అతని సహోద్యోగి మానియా పై కూడా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తారు? మరి అసలు సైమన్ ఎలా చనిపోయాడు? ఇందులో ఎవరి పాత్ర ఉంది? లాల్ మోహన్ ఈ కేసును ఎలా పరిష్కరించాడు? అన్న ప్రశ్నలకు సమాధానం కావాలంటే ఈ సినిమా చూడాల్సిందే. ఆద్యంతం ఆసక్తికరంగా సాగే ఈ మలయాళం క్రైమ్ థ్రిల్లర్ సినిమా పేరు ‘పోలీస్ డే’. సంతోష్ మోహన్ తెరకెక్కించిన ఈ చిత్రంలో టిని టామ్ (లాల్ మోహన్), నందు (సైమన్ ఇడికుల), అన్సిబా హాసన్ (మానియా), ధర్మజన్ బోల్గట్టి (భాసి), హరీష్ కణారన్ ప్రధాన పాత్రలు పోషించారు. క్రిస్పీ రన్ టైమ్ తో సాగే ఈ సినిమా ప్రస్తుతం మనోరమా మ్యాక్స్ లో స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగు వెర్షన్ అందుబాటులో లేదు కానీ ఇంగ్లిష్ సబ్ టైటిల్స్ తో ఈ మూవీని ఎంజాయ్ చేయవచ్చు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**